# అల్లుడు వచ్చాడు

ఇసుకపల్లి లక్ష్మీసావిత్రి





బండి చప్పుడు వినపడేటప్పటికి రాఘవయ్య వాలుకుర్చీలోంచి ఉలిక్కిపడి లేచి వాకిట్లోకి వచ్చాడు. కొండముచ్చు ఎదురింటి గోడమీద కూర్చుని కనపడింది. దానిని చూసేటప్పటికి వళ్ళుమండింది. 'ఛీ...' అన్నాడు. అది వెక్కిరించింది. రాఘవయ్య అరుగుమీద ఇటిక రాయిముక్క ఉంటే విసిరాడు దానిమీదకు. అది ముందుకు ఉరికింది. రాఘవయ్య రెండడుగులు వెనక్కు వేసి సావిట్లోనుంచి దొడ్లోకి వచ్చాడు





'అల్లుడు రాలేదేమా!' అనుకుంటూ. కొండముచ్చు ఇంటి మీద నుంచి దూక్కుంటూ దొడ్లోకి వచ్చింది.

జానకి దొడ్లో ఖాళీపళ్ళెంలో నిలబడి లోలాకుల్లా వ్రేళ్లాడుతున్న మందారపూల వంక చూస్తోంది. దొడ్డంతా పసుపుపూసి నట్లు ఉదయం ఎండ పాకిపోయింది. చేతుల్లో గోరింటాకు పగడంలా ఎర్రగా పండింది. వసంతఋతువులో ప్రకృతి లాగా తన శరీరమంతా పులకరించి పోతోంది. గోపాలం వస్తున్నాడని ఉత్తరం వచ్చినప్పటినుంచీ ఈ రోజు కోసం ఎదురు చూస్తోంది. ఆ రాత్రి గోరింటాకు రుబ్బి అంతా పడుకున్న తర్వాత చేతులకు, కాళ్ళకు పెట్టుకుంది. తెల్లవారుజామున లేచి శుభ్రంగా కడు క్కుని ఎర్రగా పండిన చేతులూ కాళ్లూ చూసి మురిసిపోయింది.

తలంటి పోసుకుంది. జుట్టు ఆరబెట్టు కుంటూ బావిలోకి తొంగిచూస్తే తన నీడ గోపాలంలా కనపడింది. రాఘవయ్య దొడ్లోకి రాగానే గోపాలం వచ్చాడేమో నని ఆత్రుతగా చూసింది. కొండముచ్చు ఎగురుకుంటూవచ్చి పాకమీదకూర్చుంది. పాకనిండా కుండసొర విరగకాసింది ఆ సంవత్సరం. కొండముచ్చు పిందెలు కొరికేసి మీదకు విసిరేస్తోంది. రాఘ వయ్య తోలబోయాడు, అది అరిచింది. తీగంతా పీకేసింది. జానకికి చర్రున కోపం వచ్చింది. దానితో ఇదొక బెడద, రోజూ రావటం సొరపాదంతా పాడు చెయ్యటం. లేకపోతే ఇంకా ఎన్నికాయలు కాసేదో! పడ్డ పిందెలన్నీ నిలుస్తే ఊళ్లో వాళ్ళందరికీ సరిపోయేటన్నికాయలు వచ్చేవి. జానకికి ఏం చెయ్యటానికి పాలు పోలేదు. రాఘవయ్య రాళ్ళు విసురు తుంటే కొండముచ్చు ఆటూ ఇటూ తప్పించుకుంటోందేగాని పాకవిడిచి వెళ్ళటం లేదు.

జానకికి ఉక్రోషం వచ్చింది. 'గోపా లం తొందరగా వస్తే బాగుండును' అను కుంది. వాకిట్లోకి వెళ్ళి చూసివచ్చింది. క్రిందటిసారి గోపాలం వచ్చినరోజు బాగా జ్ఞాపకం ... అప్పుడు వస్తూనే తుఫాను లాగా వచ్చాడు. బండి దిగుతూనే 'నేను వ్రాసిన ఉత్తరాలు అందలేదా ?' అని అడిగాడు. రాఘవయ్య, 'అందకేం నాయనా,' అన్నాడు. గోపాలం చర చరా ఇంట్లోకి నడిచివస్తూ 'అందినాయీ..?.. అర్థంకాలేదా మరి?...' అన్నాడు.

'అదేంమాట నాయనా...!'

'అంత నిర్లక్షం దేనికండి మరి... అమ్మాయిని తీసుకువచ్చి దింపమని వ్రాస్తిని!!... సమాధానం లేదు దానికి. ఏమిటి మీ ఉద్దేశం...అల్లుడువచ్చి హడా వుడి చేశాడని పేరుగాని మీరు చేసేవి ఎవరికీ కనపడవు...!!!'

'పండగ వెళ్ళగానే తీసుకువద్దామని ఆగాను ... అంతకంటే ఏం లేదు ...' రాఘవయ్య నసిగాడు.

'పండగ మీకేగాని నాకు ఉండదా... జానకి ఎక్కడ ?' గోపాలం ముఖానపట్టిన చెమట సర్దుకుంటూ ఆ చేత్తోనే మీసాలు సర్దుకున్నాడు.

జానకి అప్పటిదాకా వంటింటి గుమ్మం దగ్గర నిలబడి చూస్తోంది.

'సామాను సర్దుకుని బయలుదేరు... పోదాం ...' అన్నాడు గోపాలం హఠాత్తుగా.

కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళుతెచ్చి ఇచ్చింది అత్తగారు సీతమ్మ.

'కాళ్ళు కడుక్కో నాయనా...!' అంది.

'ఇంటి దగ్గర అంతా కులాసా...?' అని అడిగింది.

'ఊఁ...ఊఁ...' అంటూ సమాధానం చెప్పాడు గోపాలం.

'కాళ్ళుకడుక్కో...ప్రయాణం బడలికగా ఉంటుంది...భోజనం చేసినతర్వాత అంతా మాట్లాడుకుందాం...' అన్నాడు రాఘవయ్య.

'మాట్లాడుకోవటానికి ఏం రాచ కార్యాలున్నాయి గనక ... అమ్మాయిని ప్రయాణం కట్టించండి ... తిరుగు బండికి వెళ్ళాలి...!' అన్నాడు.

జానకి విస్తుపోయి నిలబడింది. మాటల తీవ్రత మలుపు ఎటుతిరుగుతుందో అర్థం చేసుకోలేక తలక్రిందులవుతోంది. కళ్ళలో గబుక్కున నీళ్ళు తిరిగాయి.

'నీకు అంతకోపం వచ్చిందని తెలీదు నాయనా ... అమ్మాయిని పంపటానికి నాకేమన్నా కష్టమా ... నువ్వు ఎట్లా చెప్పితే అట్లాగే చేస్తాను ... ముందు నామాటవిని కాళ్ళు కడుక్కో...' అని 'జానకీ సంచీ తీసుకువెళ్ళిలోపలపెట్టమ్మా, స్నానానికి వేన్నీళ్ళుతోడు...' అన్నాడు రాఘవయ్య జారిపోతున్న ఉత్తరీయాన్ని పైకి సర్దుకున్నాడు.

'భోజనాలు కాగానే బయలుదేరాలి... ఒక్క క్షణం ఆగటానికివీల్లేదు..'గోపాలం బూట్లు విప్పతీశాడు. జానకి కన్నీళ్ళు క్రిందకు జారకుండా తుడుచుకొని సంచీ తీసుకువెళ్ళింది. ఎవ్వరికీ కనపడకుండా జానకివైపుచూసి నవ్వుదామనుకున్నాడు గోపాలం. అందరికళ్ళూ అతనిమీదనే ఉన్నాయి.

'నీళ్ళుతోడు..' అన్నాడు విసుక్కుంటున్నట్లు.

గబగబా నీళ్ళుతోడి తుండుగుడ్డలు తెచ్చి ఇచ్చింది. చుట్టుకొని దొడ్లోకి బయలుదేరాడు గోపాలం.

'ఊళ్లోవాళ్ళందరూ చూసేట్లు ఈ బావి దగ్గర స్నానం చెయ్యాలి...ఛీ...ఛీ... స్నానంచేసివచ్చినా సరిపోయేది...' అందరికీ వినపడేట్లుగా విసుక్కున్నాడు.

గోపాలం దొడ్లోకిపోగానే రాఘవయ్య జానకిని పిలిచి 'కొంత శాంతపడేటట్లు చూడమ్మా...దొడ్లోకి పో...' అన్నాడు.

జానకి బొక్కెనలో వేన్నీళ్ళు చూపించింది. సీతమ్మకూడా వెనకాలే వెళ్ళింది.

గోపాలం ఏదో చల్లగా మాట్లాడబోయినవాడల్లా ముఖం చిటచిటలాడించి 'ఏమిటీ ఈ సబ్బు ... బట్టలు ఉతుక్కోటానికి గూడా పనికివచ్చేట్టులేదు...' అంటూ కిందపడేసాడు. సీతమ్మ వచ్చింది వచ్చినట్లు వంటింట్లోకివెళ్ళి 'కొత్తసబ్బు తెమ్మంటే తెచ్చారుకాదు ... అల్లుడిగారికి సబ్బు బాగాలేదట ...' అంది.

'మీ వాళ్ళింటికి వచ్చినప్పుడు నాకు సబ్బులిచ్చే మర్యాదచేశారా ...? పెద్ద చెప్పొచ్చావు..?' అన్నాడు రాఘవయ్య. అంతకోపంలో వచ్చిన సీతమ్మకు ఒక్కసారి నవ్వు వచ్చింది.

'పోన్లెండి...మా పుట్టింటారు మర్యాదలు తెలీయనివాళ్ళు ... తెలిసినవాళ్ళు మీరైనా సరిగ్గా ఉండొచ్చుగా...' అంది.

'మర్యాదలు నాకు మటుకు ఎలా తెలుస్తాయి ... ఎప్పుడైనా అనుభవించినవాడినైతేగా...' అన్నాడు రాఘవయ్య.

గోపాలం స్నానంచేసి తడి తుడుచుకోకుండా నీళ్ళుకారుతూ వంటింట్లోంచి వెళ్ళాడు.

'మర్యాదలన్నీ అడిగి చేయించుకోవాలి...కాఫీ ఇవ్వటంకూడా తెలీదు.. ఈ ఊళ్ళో ఎక్కడో కాఫీహోటలు ఉండాలిగా...డబ్బులిస్తానుగాని....ఇడ్లీ, కాఫీ తెప్పించు...?' అన్నాడు గోపాలం లుంగీకట్టుకుంటూ.

రాఘవయ్య వంటింట్లోకి గబుక్కున పోయి రహస్యంగా 'ఒసేయి...అల్లుడికి ఇడ్లీ తీసుకురావే..' అన్నాడు. గోపాలం వస్తాడని ఇంట్లోనే ఇడ్డెన్లుచేశారు. సీతమ్మ అయిదు ఇడ్డెన్లు ప్లేటులో పెట్టుకుని వచ్చింది.

'అడిగితే ఇద్దామనుకున్నట్లున్నాడు.. గోపాలం ఇడ్డెనుతుంచి నోట్లో వేసుకున్నాడు. 'కుదుం ఉన్నట్లుంది ...' అన్నాడు.

'ఇంకా కొంచెం నెయ్యివెయ్యమంటావా...నాయనా...'

'వెయ్యండి..వెయ్యండి...అదిగూడా అడగాలేమో అనుకుంటున్నా ...' గోపాలం ఇడ్డెన్లు గబ గబా నోట్లో వేసుకొని 'కాఫీఎక్కడ..' అన్నాడు

జానకి తెచ్చిఇచ్చింది.

గోపాలం సగంకాఫీతాగి చొక్కావేసుకున్నాడు. 'ఇప్పుడే బజారుకు పోయివస్తా' అంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

గోపాలం బయటకుపోగానే గాలివాన వెలిసినట్లయింది. భోజనంలోకి ఏం చెయ్యాలో, ఏం లోపంవస్తే ఏం గడబిడ చేస్తాడో అని హడలిపోయారు రాఘవయ్య, సీతమ్మ. జానకి ఏ మాటా చెప్పలేక పోతోంది.

గోపాలం ఇంటికి తిరిగివచ్చిన తర్వాత దేని విషయమూ మాట్లాడలేదు. మెదలకుండా భోంచేసి గదిలో ప్రక్కవేస్తే పడుకున్నాడు. ఏ వేళప్పుడు లేస్తాడో అని కాఫీకాచి ఫ్లాస్కులోపోసి ఉంచారు.

నాలిగింటికిలేచాడు గోపాలం. లేస్తూనే

'బండి టయం అయిపోయినట్లుందే...' అన్నాడు స్వగతంగా.

మంచం దగ్గరగా చాపమీద పడుకున్న జానకి ఉలిక్కిపడి లేచింది.

'మీ అమ్మావాళ్ళెక్కడ?..' అన్నాడు గోపాలం.

'అంతా దొడ్లో ఉన్నారు...'

'చెప్పవేం మరి. ఇట్లావచ్చికూర్చో సీతో ఒక మంచిమాట చెప్పాలి'. జానకి చేతులుపట్టుకున్నాడు. జానకి మంచంమీద పక్కగా కూర్చుంది. "మీ వాళ్ళ నన్నానని కోపంవచ్చిందా..."

'ఉఁహూ...' తలఅడ్డంగా ఊపింది.

'మీ నాన్న ... వాళ్ళమామగారిని... అదే మీ తాతయ్యను హడలగొట్టేవాడుటగా...'

'మీకెవరు చెప్పారు...?'

'దాగుతుందను కున్నావేమిటి...మా అమ్మ అంతా చెప్పిందిలే...అల్లుడంటే ఏమిటో మీ నాన్నకుగూడా కొంచెమురుచి చూసే అవకాశము కల్పిద్దామని...అంత కంటె ఏంలేదు...'

జానకికి ఒక్కసారి నవ్వువచ్చింది.

సీతమ్మ పక్కనేఉండి అన్నిమాటలూ వింటూనేఉంది. గోపాలం అటుప్రక్కకు చూడగానే ఉలిక్కిపడి వెనక్కువచ్చి 'అల్లుడు నిద్రలేచాడంటే అమ్మాయి...' అంది ఏమీఎరగనట్లు.

జానకి కంగారుగలేచి నిలబడింది. బయటకు వచ్చింది.

'అల్లుడు నిద్రలేచాడా...?'

'ఆ...లేచారు...'

'ముఖం కడుక్కోటానికి నీళ్ళు... సబ్బు ఇయ్యమ్మా...కాఫీ ఇద్దువుగాని..' అంది. సీతమ్మ తమని చూసిందని జానకికి స్పష్టంగా అర్థమయినా 'అట్లాగే...' అంటూ దొడ్లోకి వెళ్ళింది..

......జానకికి ఆ రోజు సంగతులన్నీ గుర్తుకు వచ్చినాయి. కొండముచ్చు ఇంకా పాకమీద కూర్చుంది. రాఘవయ్య వాసంముక్కదడిలోంచి పీకి దాని మీదకువిసిరి వేశాడు. కొండముచ్చు అక్కడ నుంచి దూకి పొట్లపాదుమీదకు ఎగిరింది. ఒకటి రెండు కాయలు గుంజిపారేసింది. దొడ్డంతా విచ్చలవిడిగా తిరిగింది. పూలమొక్కలు పీకేసింది. రాఘవయ్య రాళ్ళు విసిరాడు. కొండముచ్చు పారిపోయింది. ఆఖరికి కొండముచ్చు ఆ రోజు రాకపోతే తనకీ తోచేది కాదేమో అనుకుంది జానకి.

వాకిట్లో బండి గంటలు వినబడ్డాయి. రాఘవయ్య గబగబా వెళ్ళాడు అటువైపు. గోపాలం బండిలోనుంచి దిగాడు. జానకి ఎదురు వెళ్ళింది. గోపాలం చేతిలో సంచీ అందుకుంటూ 'నీ మాటే అనుకుంటున్నాం నాయనా...' అన్నాడు. రాఘవయ్య.

అతని మనస్సులో కొండముచ్చు మెదిలింది. ★